

7 నుంచి 'మీ కోసం'

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 7వ తేదీ శుక్రవారం నుండి పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మీకోసం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల శాసనమండలి సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతి శుక్రవారం జరిగే మీకోసం కార్యక్రమం తాత్కాలికంగా రద్దయిన విషయం విధితమే. శాసనమండలి సభ్యుల ఎన్నిక పూర్తయి ఫలితాలు ప్రకటించినందున ఎన్నికల ప్రవర్తన నియమావళిని రద్దుచేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు ఈ నేపథ్యంలో ప్రతి శుక్రవారం యధావిధిగా మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు గమనించి శుక్రవారం మీకోసం కార్యక్రమానికి హాజరై ఫిర్యాదులు అందజేయవచ్చని కలెక్టర్ వివరించారు.

తాగునీటి కష్టాలు..

● కలుషిత ఊట నీరే ఆధారం ● మొర్రిగూడ గిరిజనుల వెతలు

ప్రజాశక్తి - అరకులోయరూరల్ : అరకులోయ మండలం బస్కీ పంచాయితీ మారుమూల మొర్రిగూడ గ్రామంలో మహిళలు బిందెడు తాగునీటి కోసం



పూర్తి స్థాయిలో పని చేయని వాటర్ ట్యాంకు

కొండలెక్కుతూ దిగుతూ కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి నెలకొంది. వేసవి కాలం సమీస్తుండటంతో కొండ కోనల్లోని ఊట నీరు సైతం అడుగంటిపోయే ప్రమాదం ఉందని వెంటనే నీటి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. ఏళ్ల తరబడి తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నా అధికారులు ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోలేదని మహిళలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొర్రిగూడ గ్రామంలో సుమారు 100 కు పైగా గిరిజన కుటుంబాలు, 650 మంది జనాబా నివసిస్తున్నారు. ఊటనీరే దిక్కు. బిందెడు నీటి కోసం గిరిజన మహిళలు పిల్లలతో కొండలు, గుట్టలు దాటి కిలోమీటర్ల మేరకు నడచి తాగు నీరు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత పదేళ్ల క్రితం గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రావిటి పథకం ద్వారా ఊట గెడ్డ నుండి కుళాయి ఏర్పాటు చేసి ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా నీరు సరఫరా చేసేవారు. ప్రస్తుతం వేసవి కాలంలో సమీస్తుండటంతో రోజు రోజుకు ఊట నీరు ఇంకిపోయి వాటర్ ట్యాంక్ లో నీరు కొద్దికొద్దిగా వస్తోంది, దీంతో, నీరు అందక



కొండల నుంచి నీటిని మోసుకొస్తున్న గిరిజన మహిళలు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇక్కడ నివసించే 100 కుటుంబాలకు ఊట గెడ్డ లో తాగునీటిని సేకరించి వినియోగిస్తున్నారు.

ఊటనీరు కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో కొత్తగా బోరు తవ్వి తాగునీరు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వికలాంగ పిల్లలకు ఉపకరణాలు అందిస్తున్న దృశ్యం

వికలాంగ పిల్లలకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వికలాంగ పిల్లలకు ఉపకరణాలను బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా ట్రైబల్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వారు నాడీ సంబంధమైన చలన సమస్యలు, చలన సామర్థ్యపరంగా ఆలస్యం వంటి పిల్లలను గుర్తించారు. వారికి కాకినాడ ఉమా మనోవికాస కేంద్రం ఎన్జీవో వారి సహకారంతో ఉపకరణాలు సమకూర్చారు. వాటిని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శశిరెడ్డి, సిఎస్ఆర్ ఎమ్ఓ డాక్టర్ ఇందిరా, టిఇఐసి మేనేజర్ కె.సతీష్‌బాబు, ఫిజియోథెరపిస్టులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ రమాదేవి, ఉమా మనోవికాస కేంద్రం తరపున వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు

మండలంలో జెడ్‌పి సిఇఒ పర్యటన

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వివివి.లక్ష్మణరావు బుధవారం మారేడుమిల్లి మండలంలో పర్యటించారు. మండలంలోని వెటుకూరు ఎస్ఎజిఐ ప్రాజెక్ట్, కుట్రవాడలోని సిపిడబ్ల్యుఎస్ స్కీమ్‌ను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, నిర్మాణంలో ఉన్న కార్యాలయాన్ని పరిశీలించారు. మారేడుమిల్లి ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు పరిపాలనాధికారి యం.రత్న కుమారి, ఇఒపిఆర్‌డి పి.విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సుబ్బారావు, ఎఇ సురేష్, సీనియర్ అసిస్టెంట్ కెపి.ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు,రేపు నిరాహార దీక్షలు

1/70చట్టంపై అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలి

బినామీ, గిరిజనేతరుల వలస నిరోధక చట్టం చేయాలి

జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పాడేరు టౌన్: 1/70 చట్టం పగడ్బందీ అమలుపై అసెంబ్లీలో చట్టంపై స్పష్టమైన ప్రకటన తదితర డిమాండ్లతో అఖిలపక్ష రాజకీయ, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట గురు, శుక్రవారాల్లో నిరాహార దీక్ష చేపట్టనున్నారు. 1/70 చట్టం అమలుపై ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని, 1/70పై అయ్యన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా వివరణ ఇవ్వాలని, ఎన్నికలకు ముందు జిఒ3 పునరుద్ధరణకు టిడిపి కట్టుబడి ఉందని ప్రకటించిన రీతిగా అసెంబ్లీ సమావేశాల్లో షెడ్యూల్డ్ ప్రాంతంలోని ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే చెందేలా 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టం చేయాలని, గిరిజన సలహా మండలి (టిఎసి) ఏర్పాటు చేయాలని, ఆదివాసి ప్రాంతంలో బినామీ వ్యవస్థ, గిరిజనేతరుల వలస నిరోధక చట్టం చేయాలని, మరోపక్క 1/70 చట్టాన్ని ఉల్లంగిస్తూ హైడ్రో పవర్ ప్రోజెక్ట్ ను నవయుగ కంపెనీ కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరాహార దీక్షలు చేయనున్నారు.

నేడు ఆశాల 'చలో విజయవాడ'

జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సన్నిబాబు

ప్రజాశక్తి- పెదబయలు :ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుల దీర్ఘకాలికమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఈనెల 6న చలో విజయవాడ ఆందోళన జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు పిలుపు నిచ్చారు బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ, పెదబయలు మండలంలో 384 గ్రామాల్లో ఆశ, సిహెచ్‌డబ్ల్యు వర్కర్లు, సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని, వీరి సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత కల్పన రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.1.50లక్షలు చెల్లింపు, మహిళలకు ప్రసూతి సెలవులు మంజూరు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ వర్కర్లుగా మార్పు, అర్హులకు ఎఎన్ఎం శిక్షణనిచ్చి ఆయా పోస్టుల్లో భర్తీ చేయడం వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుక ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆదివాసి గిరిజన సంఘ మండల అధ్యక్షులు బొండా గంగాధరం, సిహెచ్‌డబ్ల్యు యూనియన్ నాయకులు లకె లక్ష్మి, కొండమ్మ పాల్గొన్నారు

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

తురకలవలస ఆశ్రమ పాఠశాల సందర్శనలో ఐటిడిఎ పిఒ అభిషేక్‌గౌడ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి - పెదబయలు : విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్‌గౌడ ఆదేశించారు. మంగళవారం రాత్రి మండలంలోని తురకలవలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సోమవారం రాగిజావ తిన్న ఆశ్రమ విద్యార్థులు కడుపునొప్పితో బాధపడు తున్నారన్న సమాచారంతో పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. రాగిజావ తినడం వలన కడుపు నొప్పి వచ్చిందని విద్యార్థులు చెప్పడంతో, రాగి పిండిని ఎవరు సరఫరా చేశారని ఆరా తీశారు. రాగి పిండిని ఫుడ్ సేఫ్టీ అధికారులకు పంపించి పరీక్షలు చేయించాలని, అంతవరకు వినియోగించద్దని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుపై ప్రశ్నించారు. అనంతరం స్టోర్ రూం, వంటగదులను తనిఖీ చేసి, పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంతోపాటు వారికి నాణ్యమైన ఆహారం, గుణాత్మక విద్యాబోధన చేయాలని ఆదేశించారు.. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డిడి వెంకటరమణ, ఎటిడబ్ల్యుఒ స్వర్ణలత పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం జరపండి

● జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ



సమావేశంలో మాట్లాడుతున్న జెసి అభిషేక గౌడ

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లాజాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గం, ఐటిడిఎ, మండల స్థాయిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లా ప్రధాన కేంద్రంలో కనీసం మూడు వేల మందితో సమావేశం ఏర్పాటు చేయాలని, వివిధ రంగాలలో నిష్ణాతులను, ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి సత్కరించాలని సూచించారు. వివిధ పథకాలకు లబ్ధిదారులను గుర్తించి వారికి బ్యాంక్ లింకేజీ, రుణాల మంజూరు ఉత్తర్వులు, చెక్కులు అందజేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినిపించేందుకు మండలస్థాయిలో ఎంపిడిఒలు, జిల్లా కేంద్రంలోనూ తగు ఏర్పాట్లు చేయాన్నారు. ఆయా కార్యక్రమాలలో పెద్ద ఎత్తున మహిళలను భాగస్వామ్యం చేయాలన్నారు.

ముఖ్యంగా ప్రజా ప్రతినిధులను, మహిళా ప్రజా ప్రతినిధులను, వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలు, ఎస్‌హెచ్‌జి మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో పని చేస్తున్న మహిళలు మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, వారి విజయగాథలు వినిపించి అందర్నీ చైతన్య పరిచి మహిళా సాధికారత వైపు ప్రోత్సహించాలని జేసి కోరారు. ముందుగా అమరావతి నుండి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యా రాణి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, మహిళా రక్షణ, భద్రత, సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను వారికి తెలియజేయాలని సూచించారు. 8 నుంచి పైలెట్ ప్రాజెక్ట్ గా ప్రారంభం కానున్న మహిళలకు టైలరింగ్ శిక్షణపై అవగాహన కల్పించి, వారికి కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కే. పద్మలత, ఐసిడిఎస్, డిఆర్ డిఎల పిడిలు ఎన్.సూర్యలక్ష్మి, వి. మురళి, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్. రజని, డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్‌బాషా, ఎల్‌డి ఎం. మోతు నాయుడు, పరిశ్రమల అధికారి జి. రవిశంకర్, డిపిఆర్‌ఒ పి. గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వ 8 నెలల పాలనలో వైఫల్యాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యం చేసి పోరాటంలో తీసుకొచ్చేదానికి సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 8 నుండి 17 వరకు గ్రామాల్లో నిర్వహించే ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. చింతూరులో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో కిరణ్ మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తిచూపడం తప్ప ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కృషి చేయడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగాయని, గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, మౌలిక సౌకర్యాల సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

న్యాయం చేస్తామని చెప్పి గ్రామసభల పేరుతో కాలయాపన చేయడం తప్ప నిర్వాసితుల సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించడం లేదన్నారు. నిర్దిష్టంగా గ్రామాలను సర్వే చేసి తక్షణమే పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామసభలు అయిపోయి లిస్టులు వచ్చిన గ్రామాల్లో సమస్యలు పరిష్కారం చేసి, పునరావాసం, ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఎనిమిది నెలలుగా ప్రభుత్వ పాలన లోపాలను ప్రజలకు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ప్రజలను చైతన్యం చేసి పోరాటంలో తీసుకురాడానికి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, పులి సంతోష్ కుమార్, ఐవి, సోయం చిన్నబాబు, పాయం సీతారామయ్య, బాబు బొర్రయ్య, కాకా అర్జున్‌దొర తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ డీడీగా రుక్మండయ్య

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా యం.రుక్మండయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలలో గిరిజన సంక్షేమ శాఖ డిటిడబ్ల్యుఒగా, పార్వతీపురం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా గతంలో పని చేసినట్లు చెప్పారు. తన పరిధిలోని ఆశ్రమ, జిపిఎస్ పాఠశాలల్లోని సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డీడీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రుక్మండయ్యను కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, చక్రధర్, రాజన్న, పి.భీమిరెడ్డి, విల్సన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రుక్మండయ్య

రేపు దారకొండలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండలో ఈనెల 7వ తేదీ శుక్రవారం దారకొండ పిహెచ్‌సి, పోలీసుశాఖ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని జీకే వీధి సిఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోని ప్రజలు ఉచిత కంటి శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాటరేటు ఆపరేషన్ అవసరమైన వారిని విశాఖపట్నం తరలించి వసతి, భోజన సౌకర్యాలు కల్పించి ఆపరేషన్ ఉచితంగా చేయించే పంపించడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఈ నెల 10న జీకే వీధి మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని, మండల పరిధిలో ఉన్న ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తహశీల్దారు రామకృష్ణ

ఆశ్రమ పాఠశాలలో తహశీల్దారు తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో జికె.వీధి తహశీల్దారు రామకృష్ణ బుధవారం ఆకస్మితంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఏడో తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి చేత తెలుగు పాఠాలు చదివించారు. 30 మంది విద్యార్థులు చేత ఇంగ్లీష్ పాఠాలు చదివించగా చదవలేని పరిస్థితి నెలకొంది. దీంతో తహశీల్దారు నిరుత్సాహానికి గురయ్యారు. ఉపాధ్యాయులు సక్రమంగా బోధించకపోవడం వల్లే విద్యార్థులు ఇంగ్లీషు పాఠాలు చదవలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులు ఇంగ్లీషులో చదవలేని పరిస్థితిపై ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యార్థులకు ఇంగ్లీషు నేర్పడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. మెనూ అమలు తీరుపై ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జికె.వీధి ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే భారీ జరిమానాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొత్త వాహన చట్టం మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే భారీ జరిమానాలు విధించనున్నట్లు కొయ్యూరు సిఐ వెంకటరమణ, ఎస్ఐ పికిషోర్ వర్మ హెచ్చరించారు. మండలంలోని కాకరపాడులో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులతో వారు సమావేశమై మాట్లాడారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1,000, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు, మద్యం తాగి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడిపితే రూ.10వేలు, నెంబర్ ప్లేట్ సరిగ్గా లేకుంటే రూ.2వేలు జరిమానా విధించనున్ననట్లు చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించి సహకరించాలని కోరారు.



వాహనదారులతో మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతకు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణఉపాధి కల్పించనున్నట్లు ఆ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ శ్యాం గోపీకృష్ణ తెలిపారు. 27 ఏళ్లలోపు వయసు కలిగిన పది, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లొమా ఇన్ మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్లో ఉత్తీర్ణులైన జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువత ఈ నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొరియర్ సూపర్వైజర్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సిఎన్సి ఆపరేటర్, సిఎన్సి ప్రోగ్రామర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ప్రొడక్ట్ డిజైన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో 2 నుండి 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనకు సహకారం అందిస్తామన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు కొరకు విశాఖపట్నం సింధియా జంక్షన్లోని సిఇఎంఎస్ కేంద్రంలో గాని, 7794840934, 8688411100, 8331901237, 0891-2704010 నంబర్లలో గాని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన యువతకు సివిల్స్ ఉచిత శిక్షణకు ఈనెల ఆరు నుంచి 13లోగా ఐటిడిఎలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటిడిఎ ఇన్ఛార్జ్ పిఒ, జెసి డాక్టర్.ఎంజె అభిషేక్ గౌడ బుధవారం ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేపగుంట యూత్ శిక్షణ కేంద్రంలో 100 మంది గిరిజన యువతకు శిక్షణ అందిస్తామన్నారు. దరఖాస్తుదారులకు 14,15 తేదీల్లో హాలుటికెట్లు జారీ చేసి, 16న మొదటి స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తామన్నారు. అందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 20 నుంచి 22 వరకు రెండవ స్క్రీనింగ్ టెస్టుకు హాలు టికెట్లు జారీ చేస్తామన్నారు. రెండో స్క్రీనింగ్ టెస్ట్లో ఎంపికైన వారికి ఉచిత శిక్షణిస్తామన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ శారద

అరకులోయలో ఘనంగా ఇసిజి డే

ప్రజాశక్తి- అరకులోయ: అరకులోయ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ సెంటర్లో పూర్వ బాల్య దశ సంరక్షణ(ఇసిజి డే) ఎర్లీ చైల్డ్ ఫుడ్ కేర్ కార్యక్రమం స్థానిక సిడిపిఒ శారద ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ వారి ఎదుగుదలకు తీసుకోవలసిన జాగ్రత్తలు, బిడ్డ పిల్లల ఆరోగ్యం, తదితర అంశాలపై అంగన్వాడీలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గొలుగొండ, కృష్ణదేవిపేట పోలీస్స్టేషన్లలో ఎస్పి తనిఖీ

గొలుగొండ : జిల్లా ఎస్పి తుహిన్సిన్హా బుధవారం సాయంత్రం గొలుగొండ, కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్లోని రికార్డులను తనిఖీ చేశారు.పెండింగ్ కేసులు వివరాలను ఎస్సై రామారావు, తారకేశ్వరరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్, రహదారి భద్రత, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కృష్ణదేవిపేట పోలీస్స్టేషన్ త్వరలో వాహనాన్ని సమకూర్చనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్మాణాలు పూర్తయిన గొలుగొండ, కెడిపేట పోలీస్ స్టేషన్ల భవనాలను సందర్శించారు.కార్యక్రమంలో డిఎస్పి పి.శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి



ఆసుపత్రిని సందర్శిస్తున్న ప్రాంతీయ సమన్వయాధికారి లక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి : వేసవి సీజన్లో వడదెబ్బ, సీజనల్గా ప్రబలే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయ అధికారిణి కె.లక్ష్మి అన్నారు. బుధవారం చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక మాట్లాడారు. వార్డులను సందర్శించి, వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ గదిని సందర్శించి రోజుకు ఎంత మందికి రక్త పరీక్షలు చేస్తున్నారని, ఏయే వ్యాధుల నిర్ధారణ అవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిని సందర్శించి, ఇక్కడి సమస్యలను తెలుసుకున్నానని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. నూతనంగా నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి ప్రాంతాన్ని సందర్శించి కాంట్రాక్టర్తో మాట్లాడి, పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యాధికారుల నియామకానికి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు ప్రాంతీయ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో ఇన్ఛార్జి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారులు రుక్మిణి, భారతి, లావణ్య, సాయి కృష్ణ, ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చర్చిల అనుమతులపై సర్వేలు ఆపాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్రవ్యాప్తంగా చర్చిల నిర్మాణాల అనుమతులపై సర్వేచేయాలని ప్రభుత్వం విడుదల చేసిన మెమోను ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు డిమాండ్ చేశారు. బుధవారం అరకులోయలో విలేకరులతో మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. , రాజ్యాంగబద్ధంగా పరిపాలన చేయకుండా అనుమతుల్లేని చర్చిలపై చర్యలకు ఉపక్రమించడం, మతాల హక్కులు, స్వేచ్ఛను హరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వ చర్యలతో .సమాజంలో మత విద్వేషాలు రేగి ఏదైనా నష్టం జరిగితే కూటమి పాలకులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సమాజంలో హిందువులు, క్రిస్టియన్లు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, ఇతర అన్ని మతస్తులు సుహృద్భావ వాతావరణంలో కలిసి ఉన్నారని, వారి మనోభావాలను కాపాడవలసిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

యుటిఎఫ్పై అచ్చెన్న వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సందర్భంగా యుటిఎఫ్పై రాజకీయాలు ఆపాదిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి మహేశ్వరరావు ఖండించారు. అధికార పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థి రఘువర్మను ఉపాధ్యాయులు ఓడించడాన్ని జీర్ణించుకోలేక, యుటిఎఫ్కు రాజకీయ రంగులు పులమడం తగదన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యలపై అవిశ్రాంతంగా పోరాడుతున్న యుటిఎఫ్పై లేనిపోని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రఘువర్మ ఓటమికి ప్రభుత్వ విద్యావిధానాలే కారణమని, వాటిని సమీక్షించి, సరిచేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కన్నయ్య, జిల్లా కార్యవర్గసభ్యులు ఎస్.బాలకృష్ణ, కె రాజారావు ఉన్నారు.

గంజాయి నిరోధానికి పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - నాతవరం : జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు్ల ఆకస్మిక తనిఖీలు (డైనమిక్ చెకింగ్) నిర్వహించాలని జిల్లా ఎస్పి తుహిన్సిన్హా స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాపై టోల్ఫ్రీ నెంబర్ 1972 ద్వారా సమాచారం అందించాలనే విషయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం నాతవరం పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీచేశారు. స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసుల ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిపై ఎస్ఐ చింతల భీమరాజుకు సూచనలు చేశారు. స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసిన వాహనాలకు కేసుల వివరాలను ట్యాగ్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజురోజుకు పెరుగుతున్నసైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీటిపై అవగాహనకు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, ప్రధాన కూడళుఉల, ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రజల సహకారంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తరచూ పర్యటించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు పోలీసులుకఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నాతవరం పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. స్టేషన్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

నేరాలు ఘోరాలు



పోలీసులకు పట్టుబడిన గంజాయి, నిందితులు

70కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- పెదబయలు: ముందస్తు సమాచారం మేరకు మండలంలోనిఅడుగుల పుట్టు పంచాయితీ, కొత్తాపుట్టు జంక్షన్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా ఒడిశా మల్కన్గిరి జిల్లా వైపు నుండి బూసిపుట్టు, రూడకోట, పెద బయలు మీదుగా ఒడిశా కోరాపుట్ జిల్లా వైపు గంజాయి లోడుతో వెళ్తున్న బొలెరో వాహనంలో రూ.3.50లక్షల విలువైన 70 కేజీల గంజాయిని పట్టుకున్నామని ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. మండలంలోని జామిగుడకు చెందిన పాంగి రామ్చందర్, సీలేరు మండలం ధారకొండకు చెందిన కిల్లో లలిత అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. .

అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో సుంకపూరు గ్రామంలో జి అప్పారావు అనే వ్యక్తి నిర్వహిస్తున్న చిన్న హోటల్ మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో హోటల్లోని రెండు ఫ్రిజ్లు, గ్రైండర్, ఇతర సామగ్రితోపాటు ఒక ద్విచక్ర వాహనం, రూ. 30 వేల నగదు కాలి బూడిదయ్యాయి, సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితునికి నిత్యావసరాలను విఆర్ఒ పెద్దన్న దొర అందజేశారు, బాధితుల్ని గ్రామంలోని జనసేన పార్టీ మండల నాయకులు సిహెచ్ శ్రీనివాస్ పరామర్శించి ప్రభుత్వ నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వే న్యూ కాలనీ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కంచరపాలెం పరిధి ధర్మానగర్, వాడపేటలో మంగళవారం స్థానిక అమ్మవారి పండగ కావడంతో తిక్కవానిపాలేనికి చెందిన గోపి (20), అచ్చిరాజు (20) సాయంత్రం పరసలో పాల్గొన్నారు. తర్వాత వారిద్దరూ అప్పాజీ మోటార్ బైక్పై అక్కడ నుండి నగరంలోకి వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి దాటాక రైల్వే స్టేషన్ వైపు నుంచి కంచరపాలెం వైపు వెళు తుండగా అతివేగంతో చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే న్యూ కాలనీ సాయిబాబా గుడి ఎదురుగా ప్రమాదం చోటు చేసుకోంది. సమాచారం అందుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్కు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. అప్పటి వరకు పండగలో సరదాగా గడిపిన ఇద్దరు యువకులు ఒక్కసారిగా మృత్యువాతకు గురికావడంతో కుటుంబ సభ్యుల రోదనలతో విషాదఛాయలు అలుముకున్నాయి. కంచరపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చెట్టుకు ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కంచరపాలెం పరిధిలో చోటు చేసుకుంది. కంచరపాలెం ఎస్ఐ సమీర్ కథనం ప్రకారం... కంచరపాలెం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన బత్తిన భానుప్రకాష్ (20) బుధవారం వేకువ జామున సుమారు 6 గంటల ప్రాంతంలో ఇంటి వెనక ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్కు తరలించారు. మృతుని తండ్రి బత్తిన పైడిరాజు (47), తల్లి కొండమ్మ (45), సోదరుడు ఆనంద్ (22) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మృతుడు ఇటీవల చెడు వ్యసనాలకు బానిసయ్యాడని స్థానికులు చెబుతున్నారు. సిఐ రవికుమార్ నేతృత్వంలో కంచరపాలెం ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టాలు అందుకున్న వారితో అతిథులు

ఘనంగా ఇగ్నో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 38వ స్నాతకోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. న్యూఢిల్లీలోని ఇగ్నో ప్రధాన కార్యాలయంలో భారత విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథిగా జరిగిన ప్రధాన కార్యక్రమాన్ని ఆన్లైన్ విధానం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు వీక్షించారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రం పరిధిలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంతీయ స్నాతకోత్సవ కార్యక్రమానికి శ్రీకాకుళంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య కె.రెమి రజని గౌరవ అతిథిగా విచ్చేసి స్నాతకోపన్యాసం చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. ఆచార్య రజని తన ఉపన్యాసంలో దూరవిద్య ద్వారా ఉత్తమ విద్యనందించేందుకు అవసరమయిన అన్ని వనరులూ ఉన్న విశ్వ విద్యాలయం ఇగ్నో అని, ఇగ్నో కోర్సులలో ఇమిడి ఉన్న ప్రత్యేక లక్షణాలు విద్యార్థులను సమాజానికి అవసరమైన వ్యక్తులుగా మారుస్తాయని అన్నారు. విద్యార్థులు తమ డిగ్రీలను కేవలం సర్టిఫికెట్లుగా కాకుండా వాటిని ఒక బాధ్యతగా తీసుకుని ఆ డిగ్రీల ద్వారా ఇగ్నో అందించిన విలువలు, క్రమశిక్షణ వంటి లక్షణాలను తమ దైనందిన జీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇగ్నో ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వార్షిక నివేదికను తెలియజేశారు. కార్యక్రమంలో ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, పూర్వ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు పాల్గొన్నారు.

విజయసాయి కుమార్తెపై చర్యలకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి : విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సిఆర్జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా సముద్ర తీరానికి సమీపంలో కాంక్రీట్ గోడ నిర్మించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎపి కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ చైర్మన్ను హైకోర్టు ఆదేశించింది. జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి నిపుణుల కమిటీ వేయాలని కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖను ఆదేశించింది. అలాగే కాంక్రీట్ గోడ కూల్చివేతకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ఆ కంపెనీ నుంచే రాబట్టాలని జివిఎంసి కమిషనర్కు ఉత్తర్వులు జారీ చేసింది. కాంక్రీట్ గోడను పూర్తిగా తొలగించకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ విషయాన్ని నివేదికలో పేర్కొనలేదని ఆక్షేపించింది. ఇసుక కింద 588 మీటర్ల పొడవు, ఆరు అడుగులు లోతున్న గోడ పునాదులను కూడా తొలగించాల్సిందేనని తేల్చి చెప్పింది. భీమునిపట్నం సమీపంలో సిఆర్జెడ్ నిబంధనలు ఉల్లంఘించి నాలుగు రెక్టోబార్లు నిర్వహణ జరుగుతోందో లేదో నివేదిక ఇవ్వాలని ఎపి కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, జివిఎంసి కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్లతో కూడిన కమిటీకి ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే చేసేటప్పుడు రెస్టోబార్ యజమానులను భాగస్వాములను చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలను జారీ చేసింది. భీమునిపట్నం పరిధిలో పెనక నేహారెడ్డి శాశ్వతంగా కాంక్రీట్ నిర్మాణం చేయడాన్ని సవాలు చేస్తూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ పిల్ దాఖలు చేశారు. గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు కూడా మరో పిల్ వేశారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కెఎస్.మూర్తి వాదిస్తూ కాంక్రీట్ గోడను పాక్షికంగానే కూల్చారని చెప్పారు. అధికారులు సర్వేకు వచ్చినప్పుడు గోడను ఇసుకతో కప్పిపెట్టారని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదిస్తూ కమిటీ సర్వే చేపట్టడానికి ముందే అధికారులు సర్వే చేసి సిఆర్జెడ్ రూల్స్ అమల్లోకి రాకముందు నిర్మించిన ఒక పాత భవనం, కొన్ని టాయిలెట్లు మినహా మిగిలిన వాటిని కూల్చేశారని చెప్పారు. అయితే భూమి పైన ఉన్న గోడ వరకు అధికారులు తొలగించారని చెప్పడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

'గీత'కు గాలం

విశాఖలో నేడు14 మద్యం షాపులకు వేలం
316 దరఖాస్తులతో ఎక్సైజ్కు రూ.6.32 కోట్ల ఆదాయం
బినామీలను దించిన బడా వ్యాపారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దరఖాస్తులు వారివే.. కానీ దర్పం మాత్రం బడాబాబులది. గీత కార్మికులకు మద్యం షాపులను లాటరీలో ఇచ్చే ప్రభుత్వ విధానం వెనుక అసలు రహస్యం ఇదే. కల్లు గీత కార్మికులకు మద్యం అమ్మకాల్లోనూ భాగస్వామ్యం కల్పించి ఆర్థికంగా వారిని ముందుకు తీసుకెళ్లాలన్న విధానానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ ఆచరణలో గుండగుత్తగా కొంతమంది బడా వ్యక్తులే గీత కార్మికుల వెనుక ఉండి దరఖాస్తులు చేయించి షాపులకు యజమానులుగా మారిపోతున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే. ప్రభుత్వం గీత కార్మికులకు షాపులిచ్చామంటూ లెక్కలు రాసుకోడానికి మాత్రమే తాజా విధానం దోహదపడుతోంది. నగరంలోని విఎంఆర్డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో నేడు 14 మద్యం షాపులకు వేలం పాట జరుగనుంది. ఇది వరకూగల మద్యం షాపుల ఓనర్లే ఇక్కడ గీత కార్మికులను ఆర్థికంగా కొల్లగొట్టబోతున్నారు. కొద్ది నెలల క్రితం విశాఖలో 145 షాపులను ఎలాగైతే మద్యం దుకాణాల వేలంలో అత్యధికంగా బడాబాబులు, సంస్థలు దక్కించుకున్నాయో ఇక్కడా అవే దృశ్యాలు గురువారం కనపడనున్నాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ విషయంపై మాట్లాడుతూ గీత కార్మికులకే దరఖాస్తులు ఇచ్చామని, లైసెన్సులు గీత కార్మికుల పేరునే కచ్చితంగా ఉంటాయని అంటున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా దరఖాస్తులు

జివిఎంసి పరిధిలో 14 షాపులకు వేలం ప్రక్రియ గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చేపడుతున్నారు. ఈ క్రమంలో విఎంఆర్డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టారు. మొన్నటివరకూ ఎంఎల్సి కోడ్ ఉండడంతో ఫిబ్రవరి 11న జరగాల్సిన వేలం ప్రక్రియను మార్చి 6కు వాయిదా వేశారు. దరఖాస్తు ఫీజు గీత కార్మికులకు రూ.2 లక్షలే కావడంతో ఇబ్బడి ముబ్బడిగా 316 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు మాంచి కిక్కు లభించినట్టయింది. దరఖాస్తుల ఆదాయం రూ.6 కోట్లా 32 లక్షలు వచ్చినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఎఇఎస్) బి.ఈశ్వరరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ఇక్కడా వారే..

గతంలో షాపులు దక్కని వారు, ఇంకా మద్యం ద్వారా లభిస్తున్న ఆదాయంతో సంతృప్తి చెందని కొన్ని సంస్థల వారు ఈ వేలం పాటలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. రూ.లక్షలు చెల్లించే స్తోమత గీత కార్మికుల్లో అందరికీ ఉండకపోవడంతో నగరంలోని మద్యం షాపులపై పట్టు సాధించిన కొన్ని వ్యాపార సంస్థలు వారి దగ్గర పనిచేసే వారిలో గీత కార్మికులుంటే వారి పేర ఈ 14 షాపులను దక్కించుకోడానికి దరఖాస్తులు చేసుకున్నట్టు సమాచారం. మామూలుగా అయితే గ్రామీణ ప్రాంతంలో రూ.8 లక్షలు, నగరంలో రూ.12 లక్షలను దరఖాస్తు ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంది. గీత కార్మికులకు పెద్ద ఎత్తున ప్రభుత్వం రాయితీ కల్పించడంతో రూ.2 లక్షలే దరఖాస్తు ఫీజు కట్టాలి. ఇదే అదునుగా బడా బాబులు వారి అనుకూల గీత కార్మికులతో సునాయాసంగా దరఖాస్తులు చేసేశారు. షాపులను వేలంలో దక్కించుకునే విషయంపై వారంతా ఇప్పుడు దృష్టిసారించారు. షాపులు దక్కించుకున్న తర్వాత లాభాల విషయంలో పాత పద్ధతే వర్తించనుంది. విశాఖ జిల్లాలో అధికారికంగా ఉండే 145 షాపులకు ఎలాగైతే సేల్స్లో 14 శాతం లాభం ఉంటుందో గీత కార్మికుల దరఖాస్తుల షాపులకూ అదే వర్తించనుంది.

నెలకు రూ.155 కోట్లు

నెలకు విశాఖపట్నంలో 145 మద్యం షాపుల ద్వారా ఎక్సైజ్ శాఖకు ఆదాయం రూ.155 కోట్లుగా ఉంది. ఈ ఏడాది జనవరిలో రూ.156 కోట్లు, ఫిబ్రవరిలో రూ.153 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి మద్యం ద్వారా లభించింది.

నేడు బాబు, నిర్మలా సీతారామన్ పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గురువారం జిల్లాలో జరగబోయే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ల పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు అధికారులకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పలు ఆదేశాలు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్

గురువారం ఉదయం 10.15 గంటలకు విశాఖలోని ఎన్టిఆర్ భవన్ వద్ద చంద్రబాబు బయలుదేరి గీతం యూనివర్సిటీకి 10.30కి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అక్కడ జరిగే పుస్తక ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. తర్వాత ఢిల్లీ వెళ్తారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి షెడ్యూల్

గురువారం ఉదయం గీతం యూనివర్సిటీలో జరిగే పుస్తక ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొంటారు. ఆమె విశాఖలోని నోవాటెల్ హోటల్ నుంచి అక్కడకు ఉదయాన్నే బయలుదేరుతారు. పుస్తకావిష్కరణ కార్యక్రమం తరువాత బడ్జెట్ అంశాలపై నోవాటెల్ హోటళ్లో మధ్యాహ్నం నిర్వహించే సదస్సులో కీలకమైన అధికారులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులతో భేటీ అవుతారు. బడ్జెట్కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చిస్తారు.

చిట్టిబాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

లలిత సంగీతానికి జీవం పోసిన మహోన్నత వ్యక్తి బండారు చిట్టిబాబు మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు బుధవారం విడుదల చేసిన సంతాప ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. స్వతహాగా చిన్నతనంలోనే హార్మోనియం పట్టుకున్న బండారు ఆకాశవాణి ఎ - గ్రేడ్ కళాకారునిగా ఎంతో మందికి సంగీత జీవితాన్ని ప్రసాదించారన్నారు. ఆకాశవాణిలో వెయ్యికి పైగా లలిత గీతాలకు బాణీలు సమకూర్చిన చిట్టిబాబు కళా ప్రవీణ వంటి ఎన్నో అవార్డులు అందుకున్నారని గుర్తుచేశారు.



అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

రామదుర్గం గుడి వరకూ బిటి రోడ్డు వేయాలి

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలం పూడిపల్లి గ్రామపంచాయతీ పరిధి నేలకోట గ్రామానికి సమీపంలో ఉన్న పురాతన రామాలయం రామదుర్గం గుడి వరకు బీటీ రోడ్డు వేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జెఎసి నాయకులు శిథిలావస్థలో ఉన్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ శరభవరం గ్రామపంచాయతీ పరిధి కమలంపాలెం జంక్షన్ నుండి శరభవరం, నేలకోట గ్రామం వరకు రోడ్డు మొత్తం శిథిల్యావస్థకు చేరడంతో ప్రయాణం చేయాలంటే భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 6న జరుగు శ్రీరామ నవమి నాటికి యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశంతో పాటు వివిధ తరగతుల్లో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టివిఎం మోహన్, వైస్ ప్రిన్సిపాల్ శివాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో ఐదో తరగతిలో 80 సీట్లు, 6వ తరగతిలో 15 సీట్లు, 8వ తరగతిలో 3 సీట్లు, 9వ తరగతిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కొరకు పాఠశాలలోగాని, గురుకుల వెబ్సైట్లోగాని సంప్రదించవచ్చని తెలిపారు.

మంత్రి లోకేష్ను కలిసిన ప్రసాద్

ప్రజాశక్తి-కొయ్యూరు : ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టిడిపి రాజానగరం నియోజకవర్గం అబ్జర్వర్గా వ్యవహరించిన మాజీ జిసిసి చైర్మన్ ఎంవివి ప్రసాద్ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ప్రసాద్ను లోకేష్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను, పార్టీ బలోపేతం గురించి లోకేష్కు సవివరంగా వివరించినట్లు తెలిపారు.

విశాఖలో సినీ తారల సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఎన్నో ఏళ్లుగా వస్త్ర వ్యాపార రంగంలో సేవలు అందిస్తున్న మెబాజ్ షోరూమ్లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రాండ్ వెడ్డింగ్ కలెక్షన్ 'యు ఆర్ ది అకేషన్' విభాగాన్ని సినీనటి రన్ రాజా రన్ , రాజుగారి గది - 2 ఫేం సీరత్ కపూర్, పొలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల, బిగ్ బాస్ - 6 ఫేం అనిల్ రాథోడ్ బుధవారం సాయంత్రం ప్రాంభించారు. ఈ మేరకు సిరిపురం సమీపంలోని మెబాజ్ షోరూమ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మెబాజ్ షోరూం వారు అద్భుతమైన నూతన వివాహ ఫ్యాషన్ వస్త్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. పురుషులు, స్త్రీలు, పిల్లలను ఆకర్షించే విధంగా బ్రైడల్ లెహంగాలు, రీగల్ షెర్వానీలు ఉన్నాయని అన్నారు.

జిఒలపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పురపాలక మంత్రిత్వ శాఖ ఇటీవల జారీ చేసిన జిఒలు 3, 4, 5, 20లపై సిరిపురంలోని విఎంఆర్డిఎ చిల్డ్రన్స్ థియేటర్లో డిటిసిపి అధికారులు ఎల్టిపిఎస్లకు, ఇంజినీర్లుకు, ప్లానింగ్ సెక్రటరీలకు బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిటిసిపిఒ నాయుడు, ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, విఎంఆర్డిఎ చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప పాల్గొన్నారు.